క్లుప్తంగా

భక్తిశ్రద్ధలతో కుంకుమార్చన



కుంకుమార్చన చేస్తున్న భక్తులు

మీర్‌పేట: శివసాయినగర్ కాలనీలోని శ్రీగౌరీ నీలకంఠేశ్వరస్వామి సమేత లక్ష్మీగణపతి దేవాలయంలో శ్రీగాయత్రి సేవా సంఘం ఆధ్వర్యంలో గురువారం నిత్య సహస్రనామ కుంకుమార్చన కార్యక్రమం నిర్వహించారు. వేద పండితులు దేవరకొండ లక్ష్మీనరసింహ శాస్త్రి, ప్రధాన అర్చకులు లక్ష్మీగణపతిరావు ముందుగా ఆలయంలో గణపతి పూజ, కుంకుమార్చనలో మహిళలు పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు వెంకటకృష్ణారావు, వెంకటరమణ, శివరామప్రసాద్, కార్యదర్శి శ్రీనివాస ప్రసాద్ పాల్గొన్నారు.

గురుకులంలో విద్యుత్ దీపాల ఏర్పాటుకు ఆర్థిక సాయం



వైస్ ప్రిన్సిపాల్‌కు నగదు అందజేస్తున్న కాంగ్రెస్ నాయకులు

కందుకూరు: బైరాగిగూడ సమీపంలోని మహాత్మా జ్యోతిరావుపూలే గురుకుల పాఠశాలలో విద్యుత్ దీపాల ఏర్పాటు కోసం కాంగ్రెస్, ఎన్‌ఎస్‌యూఐ నాయకులు చేయూతనందించారు. ఎన్‌ఎస్‌యూఐ జిల్లా ప్రధాన కార్యదర్శి తల్లోజు వినోద్‌చారి ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీ ఎస్టీ సెల్ కార్యదర్శి విస్లావత్ ఆంజనేయులునాయక్ గురువారం వైస్ ప్రిన్సిపల్ వసుంధరకు రూ.20 వేల నగదు అందజేశారు. కార్యక్రమంలో యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు దంతోజు నరసింహాచారి, పార్టీ మైనార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎండీ అఫ్జల్‌బేగ్, సీనియర్ నాయకులు ఢిల్లీ శ్రీధర్‌ముదిరాజ్, బుక్క పాండురంగారెడ్డి పాల్గొన్నారు.

ఉద్యమకారుల కోకన్వీనర్‌గా నరసింహ



మంత్రి చేతుల మీదుగా నియామక పత్రం అందుకుంటున్న నరసింహ

కందుకూరు: మహేశ్వరం నియోజకవర్గం ఉద్యమకారుల కోకన్వీనర్‌గా మండలంలోని మీర్‌ఖాన్‌పేటకు చెందిన కాకి నరసింహ నియమితులైయ్యారు. ఈ మేరకు గురువారం మంత్రి సబితారెడ్డి చేతుల మీదుగా నియామక పత్రం అందుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తనపై నమ్మకం ఉంచి పదవి అప్పగించినందుకు మంత్రికి కృతజ్ఞతలు తెలిపారు. పార్టీ బలోపేతంతో పాటు ఉద్యమకారుల సమస్యల పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానన్నారు.


సీసీ రోడ్డు పనుల ప్రారంభం



సీసీ రోడ్డు పనులను పరిశీలిస్తున్న మేయర్

బడంగ్‌పేట్: కార్పొరేషన్ పరిధిలోని అల్మాస్‌గూడలోని 24వ డివిజన్‌లో ఏపీఆర్ఆర్ కాలనీలో సీసీ రోడ్డు నిర్మాణ పనులను గురువారం మేయర్ పారిజాత ప్రారంభించారు. ఈ సందర్భంగా రోడ్డు పనుల్లో నాణ్యాతా ప్రమాణాలు పాటించాలని సూచించారు. కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్ ఏనుగు రాంరెడ్డి, డీఈఈ జ్యోతిరెడ్డి, కాలనీవాసులు పాల్గొన్నారు.

నవభారత్ నూతన కమిటీ ఎన్నిక



లక్ష్మణ్‌ముదిరాజ్

కందుకూరు: కందుకూరు గ్రామ నవ భారత్ యువ జన సంఘం నూతన కమిటీని గురువారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా మీగడి లక్ష్మణ్‌ముదిరాజ్, ఉపాధ్యక్షులుగా ఎడ్ల సురేష్, శేఖర్, ప్రధాన కార్యదర్శిగా ముఖేష్, కోశాధికారిగా సిద్ధార్థ, కార్యదర్శులుగా జయంత్, రాజేశ్, ప్రశాంత్, సభ్యులుగా వంశీ, నరేందర్, కార్తీక్, పవన్, శివమణి, ప్రవీణ్, హర్షిత్‌ను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో సంఘం మాజీ అధ్యక్షుడు ఉదయ్‌ముదిరాజ్, ముదిరాజ్ సంఘం గ్రామ శాఖ అధ్యక్షుడు కావలి శ్రీనివాస్, నర్సింహ, శేఖర్, కృష్ణ, రవీందర్, శ్రీనివాస్, రొట్టెల కిష్టయ్య, వెంకటయ్య పాల్గొన్నారు.

‘చైర్మన్’పై చర్చ

- రౌడీషీటర్ బావజీర్ హత్య కేసులో ఇరుక్కున్న అబ్దుల్లా సాది
- చైర్మన్ పీఠంపై మొదలైన ఉత్కంఠ
- మజ్లిస్ అధిష్టానంతో జల్‌పల్లి నేతల సమావేశం



జల్‌పల్లి మున్సిపాలిటీ కార్యాలయం

పహాడీషరీఫ్: రౌడీషీటర్ బావజీర్ హత్యకు కుట్ర పన్నిన ఘటనలో జల్‌పల్లి మున్సిపల్ చైర్మన్ అబ్దుల్లా సాది అరెస్ట్ కావడం స్థానికంగా చర్చనీయాంశమైంది. మున్సిపాలిటీ వద్ద ఏ ఇద్దరు కలిసినా గురువారం ఇదే విషయమై చర్చిస్తూ కనిపించారు. చైర్మన్‌కు బెయిల్ ఎప్పుడు వస్తుంది.. ఆలస్యమైతే పదవి ఉంటుందా..పోతుందా....? అనే చర్చ మొదలైంది. ఇక కౌన్సిలర్లలోనైతే మూడు రోజుల ముందు నుంచే చైర్మన్ విషయమై ప్రస్తావనకు వచ్చినట్లు తెలిసింది. చివరకు స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ఆయన మున్సిపాలిటీలో జెండావిష్కరణకు కూడా హాజరవ్వలేదు. అందరూ ఊహించినట్లుగానే చైర్మన్ అరెస్ట్ అయ్యారు. ఒకవేళ పదవి పోతే...? వైస్ చైర్మన్‌కు అవకాశం దక్కుతుందా.. మరేదైనా అంశం తెరపైకి వస్తుందా అనేది తేలాల్సి ఉంది. నూతన చైర్మన్‌ను ఎన్నుకోవాలని కలెక్టర్ ఆదేశిస్తే మిత్రపక్షాలుగా ఉన్న బీఆర్ఎస్‌కు అవకాశం ఇస్తారా..? లేక మజ్లిస్ నుంచే మరొకరికి చాన్స్ ఇస్తారా..? అనే చర్చ జోరందుకుంది. ఈ విషయమై గురువారం మజ్లిస్‌కు చెందిన కౌన్సిలర్లు, ముఖ్య నేతలు పార్టీ అధిష్టానం వద్ద సమావేశమై చర్చించినట్లు విశ్వసనీయ సమాచారం. మజ్లిస్ మహేశ్వరం ఇన్‌చార్జ్‌గా ఉన్న చైర్మన్ తండ్రి అహ్మద్ సాది కూడా ఇదే కేసులో ఏ- 2గా ఉండడంతో ఆ పోస్ట్ కూడా ఎవరికి ఇస్తారనే విషయమై మజ్లిస్ నాయకులు సమాలోచనలు చేసినట్లు తెలిసింది.

రెండున్నరేళ్లుగా వివాదం..

జల్‌పల్లి మున్సిపాలిటీలో నెలకొన్న సమస్యలను రెండున్నరేళ్ల నుంచి సోషల్ మీడియా వేదికగా చూపుతూ చైర్మన్ అబ్దుల్లా సాది, అతని తండ్రి అహ్మద్ సాదిని లక్ష్యంగా చేసుకొని బావజీర్ ప్రశ్నించడం ప్రారంభించాడు. జల్‌పల్లి మున్సిపాలిటీలో అవినీతి, అక్రమాలు జరుగుతున్నాయంటూ యూట్యూబ్‌లో పోస్ట్ చేస్తూ తమ రాజకీయ ప్రతిష్టను దెబ్బతీస్తున్నాడని అహ్మద్ సాది కుటుంబం అతనిపై కక్ష పెంచుకుంది. ఈ విషయమై పలుమార్లు హెచ్చరించింది. రాజీ సైతం కుదుర్చి రూ.7 లక్షలు కూడా బావజీర్‌కు అప్పజెప్పినట్లు సౌత్ ఈస్ట్ డీసీపీ రూపేష్ వెల్లడించారు. అయినా అతడు తమపై బురద జల్లే పనులు మానకపోవడంతోనే.. బావజీర్ స్నేహితులకు రూ.13 లక్షల సుపారీ ఇచ్చి హత్య చేయించినట్లు పోలీసుల విచారణలో తేలింది.

హామీల అమలులో సీఎం విఫలం

- మంత్రి సబితారెడ్డి హత్యా రాజకీయాలను ప్రోత్సహిస్తున్నారు
- బీజేపీ నేత శ్రీరాములు యాదవ్ మండిపాటు
- బాలాపూర్ మండల కార్యాలయం ఎదుట ధర్నా



అధికారులకు వినతిపత్రం అందజేస్తున్న బీజేపీ నాయకులు

బడంగ్‌పేట్: పేదలను దగా చేస్తున్న బీఆర్ఎస్ ప్రభుత్వం, ముఖ్యమంత్రి కేసీఆర్ ఇచ్చిన హామీలను నిలబెట్టుకోవాలని బీజేపీ మహేశ్వరం నియోజకవర్గ ఇన్‌చార్జ్ అందెల శ్రీరాములుయాదవ్ డిమాండ్ చేశారు. పార్టీ పిలుపు మేరకు గురువారం బాలాపూర్ మండల కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. హామీల అమలులో కేసీఆర్ విఫలమయ్యారని మండిపడ్డారు. బీఆర్ఎస్ అధికారంలోకి వచ్చి తొమ్మిదేళ్లు గడుస్తున్నా.. లబ్ధిదారులకు డబుల్ బెడ్‌రూంలు ఇవ్వలేదన్నారు. కొత్త పింఛన్లు, నిరుద్యోగభృతి పత్తాలేదని ఆగ్రహం వ్యక్తంచేశారు. పార్టీ మారిన సబితారెడ్డి హత్యా రాజకీయాలను ప్రోత్సహిస్తున్నారని ఆరోపించారు. బాధ్యతాయుతమైన పదవిలో ఉన్న మున్సిపల్ చైర్మన్ కిరాయి హంతకులతో యూట్యూబర్ బావజీర్‌ను హత్య చేయించడంపై ఆమె స్పందించకపోవడం దారుణమన్నారు. మీర్‌పేటకు చెందిన ఓ ఎస్టీ మహిళను పోలీసులు విచక్షణారహితంగా కొట్టినా బాధితులకు న్యాయం చేయలేదని ఆరోపించారు. అనంతరం మండల అధికారులకు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కదారి జంగయ్య, ధీరజ్‌రెడ్డి, కన్వీనర్ దేవేందర్‌రెడ్డి, మల్లేశ్, ఆర్కేపురం డివిజన్ కార్పొరేటర్ రాధా ధీరజ్‌రెడ్డి, పిట్ట ఉపేందర్, చెరుకుపల్లి వెంకట్‌రెడ్డి, బడంగ్‌పేట కార్పొరేటర్లు, బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

చిట్టి తల్లులకు ఎంత కష్టం

- ఏడాది తేడాతో తల్లిదండ్రుల మృతి
- చెల్లెల్లకు అన్నీ తానే అయిన అక్క
- ఆపన్న హస్తం కోసం ఎదురుచూపులు



అనాథ చిన్నారులు (ఫైల్)

హుడాకాంప్లెక్స్: ప్రశాంతంగా జీవిస్తున్న కుటుంబం .. అనారోగ్యం ఇంటి పెద్దల్ని కబలించింది. దీంతో నలుగురు చిన్నారులు అభాగ్యులయ్యారు. సరూర్‌నగర్ మండలం చంపాపేటలో చోటు చేసుకుంది. వివరాల ప్రకారం గన్నేపాక నర్సింగరావు, సుజాత దంపతులకు ముగ్గురు ఆడపిల్లలు, ఒక బాబు ఉన్నారు. నర్సింగరావు జీహెచ్ఎంసీలోని సర్కిల్-8లో కామాటిగా విధులు నిర్వహించేవాడు. ఎలాంటి ఇబ్బందులు లేకుండా వచ్చిన సంపాదనతో కుటుంబం సాఫీగా నడుస్తోంది. ఉన్నట్లు ఉండి నర్సింగరావు, సుజాత అనారోగ్యం పాలై య్యారు. ఆరోగ్యం విషమించి 2013లో తల్లి సుజాత మరణించింది. తల్లి మరణించిన ఏడాది గడవకముందే 2014లో తండ్రి నర్సింగరావు మరణించాడు. వీరికి ముగ్గురు కూతుర్లు శ్రీలత, శ్రీచిత్ర, శ్రీవిద్య, కుమారుడు సాయిచరణ్‌లు ఉన్నారు. సుజాత చనిపోయిన సమయంలో అందరూ చిన్న వయసులే. సాయి చరణ్‌కు అప్పటికి రెండేళ్ల వయస్సు. తల్లిదండ్రుల మరణంతో నలుగురు పిల్లలు అనాథలయ్యారు. వాళ్ల మేనమామ సుభాష్ వారికి అండగా ఉంటూ సంరక్షణ బాధ్యతలు తీసుకున్నారు.

అక్కపైనే అందరి బాధ్యత..

వీరి పెద్ద కూతురు శ్రీలత ఓ కిరాణా దుకాణంలో పనిచేస్తూ ఇంటర్ చదువుతోంది. చదవడానికి సమయం లేక ఇంటర్ మొదటి సంవత్సరం పరీక్ష ఫెయిలైంది. తండ్రి కామాటి ఉద్యోగం చేస్తున్న ప్పటి పీఎఫ్ ప్రభుత్వం నుంచి రావాల్సి ఉంది. ప్రభుత్వం నుంచి ఎలాంటి సహాయ, సహకారాలు అందడం లేదు. ఎన్నిసార్లు జీహెచ్ఎంసీ కార్యాలయం చుట్టూ తిరిగినప్పటికీ వారి గోడు వినిపించుకునే నాథుడే కరువయ్యాడు. ఇటు అయినవారెవరూ లేక.. అటు తండ్రి ఉద్యోగం నుంచి రావల్సిన బెనిఫిట్స్ రాక.. ఆ పిల్లలు ఆర్థికంగా ఇబ్బంది పడుతున్నారు. దాతలు ముందుకొచ్చి ఆదుకోవాలని కోరుతున్నారు.

మమ్మల్ని ఆదుకోవాలి: శ్రీలత



మా తండ్రి చనిపోయినందున ప్రభుత్వం మాకు సహాయ, సహకారాలు అందించాలి. 2007 సంవత్సరంలో మా తండ్రి కామాటి ఉద్యోగంలో చేరి 2014లో విధి నిర్వహణలో ఉన్నప్పుడే మరణించాడు. ప్రభుత్వం మమ్మల్ని ఆదుకోవాలి.

విధుల్లో చేరిన వీఆర్‌ఏలు

తుక్కుగూడ: ఉద్యోగుల సర్దుబాటులో భాగంగా తుక్కుగూడ మున్సిపాలిటీకి ఉన్నత అధికారులు కేటాయించిన 8 మంది వీఆర్‌ఏలు గురువారం విధుల్లో చేరినట్లు మున్సిపల్ కమిషనర్ బి.వెంకట్రామ్ తెలిపారు. వీరికి త్వరలో మున్సిపాలిటీలో బాధ్యతలు అప్పగిస్తామన్నారు.

కాంగ్రెస్ గెలుపునకు కృషి చేయండి



సమావేశంలో కాంగ్రెస్ నాయకులు

బడంగ్‌పేట్: కార్పొరేషన్ పరిధిలోని మల్లాపూర్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో మహేశ్వరం నియోజకవర్గం సీనియర్ నాయకులు చిగురింత నర్సింహారెడ్డి ఆధ్వర్యంలో గురువారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మహేశ్వరం నియోజకవర్గం యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడిగా నియమించిన పి.గణేష్‌రెడ్డిని బడంగ్‌పేట పార్టీ తరఫున సన్మానించారు. రాబోయే ఎన్నికల్లో యూత్ కాంగ్రెస్, ఎన్‌ఎస్‌యూఐ నాయకులు, కార్యకర్తలు సైనికుల్లా శ్రమించి మహేశ్వరం నియోజకవర్గంలో జెండా ఎగురవేయాలని నర్సింహారెడ్డి కోరారు. కార్యక్రమంలో బడంగ్ పేట కార్పొరేటర్లు ప్రభాకర్‌రెడ్డి, దర్శన్‌రెడ్డి, నాయకులు ఆర్.శ్రీనివాస్‌రెడ్డి, రాజేందర్‌రెడ్డి, సుధాకర్‌రెడ్డి, బి.గోవర్ధన్‌రెడ్డి ఉన్నారు.

వర్క్‌జోన్ సెంటర్ నుంచి విముక్తి కల్పించాలని వినతి



మంత్రి సబితారెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న కాలనీవాసులు

బడంగ్‌పేట్: బడంగ్‌పేట కార్పొరేషన్ పరిధిలోని నాదర్‌గుల్‌లోని చాణక్యపురి లేవుట్‌ను వర్క్‌జోన్ సెంటర్ నుంచి రెసిడెన్సియల్ జోన్‌లోకి మార్చేలా చర్యలు తీసుకోవాలని గురువారం ప్లాట్ల వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మంత్రి సబితారెడ్డికి వినతిపత్రం అందచేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. 37 సంవత్సరాల క్రితం నాదర్‌గుల్‌లోని 609 సర్వే నంబర్‌లో 2756 మంది కలిసి చాణక్యపూరి లేఅవుట్‌లో ప్లాట్లను కొనుగోలు చేశామన్నారు. 1986లో ఏర్పడిన హెచ్ఎండీఏ ప్లాట్లను తనిఖీ చేయకుండా చాణక్యపూరి కాలనీని హార్డ్‌వేర్ పార్కులో కలిపేశారని ఆరోపించారు. మేము కొన్నప్పుడు ప్రైవేట్ పట్టాలని, హార్డ్‌వేర్ పార్కు అసలే లేదని మంత్రికి వివరించారు. నాటి నుంచి నేటి వరకు పోరాటాలు చేస్తూనే ఉన్నామని గుర్తు చేశారు. ప్లాట్లు కొనుగోలు చేసిన కుటుంబాలు ఇప్పటికీ ఇబ్బందులు పడుతున్నామని వాపోయారు. స్పందించిన మంత్రి మాట్లాడుతూ.. ఈ సమస్య చాలా ఏళ్లుగా తన దృష్టికి తేస్తునే ఉన్నారు. సమస్యను పరిష్కారం చేస్తామని హామీ ఇచ్చారు. వెంటనే చీఫ్ కమిషనర్ ఆఫ్ లాండ్ అడ్మినిస్ట్రేషన్ కమిషనర్ నవీన్‌మిట్టల్‌కు ఫోన్ చేసి ఈ మాసంలో పరిష్కారం అయ్యేలా చూడాలని కోరారు. వినతిపత్రం ఇచ్చిన వారిలో చాణక్యపూరి వెల్ఫేర్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి వేణుగోపాల్‌రావు, ఆర్గనైజింగ్ సెక్రటరీ శ్రీరాములు, కొండారెడ్డి ఉన్నారు.

రైతుల గుండెల్లో సీఎం కేసీఆర్

నహకార సంఘం చైర్మన్ పెంటారెడ్డి



వివరాలు వెల్లడిస్తున్న చైర్మన్ పెంటారెడ్డి

బడంగ్‌పేట్: రుణమాఫీ చేసి రైతుల గుండెల్లో నిలిచిపోయిన సీఎం కేసీఆర్‌కు ప్రత్యేక కృతజ్ఞతలు బండ్లగూడ ఖల్సా బాలాపూర్ సహకార సంఘం చైర్మన్ సింగిరెడ్డి పెంటారెడ్డి తెలియజేశారు. ఈ సందర్భంగా గురువారం బాలాపూర్‌లోని సహకార సంఘం కార్యాలయంలో చైర్మన్ పెంటారెడ్డి రైతు రుణమాఫీ వివరాలను వెల్లడించారు. బాలాపూర్ సహకార సంఘంలో 149 మంది రైతులు రుణం తీసుకున్నారని గుర్తు చేశారు. ప్రభుత్వం 2018 డిసెంబర్ లోపు తీసుకున్న లక్షలోపు రుణమాఫీ చేసిందన్నారు. ముందుగా మొదటి విడతలో 15 మంది రైతులకు రూ.2.64 లక్షలు, రెండో విడతలో 43 మంది రైతులకు రూ.15.79 లక్షలు, మూడో విడతలో 50 మంది రైతులకు 34.93 లక్షల చొప్పున మొత్తంగా 108 మంది రైతులకు కలిపి రూ.53.37 లక్షలకు పైగా రుణమాఫీ జరిగిందని పేర్కొన్నారు. ఇంకా 41 మంది రైతులకు కాలేదన్నారు. రూ.20.83 లక్షలు రుణమాఫీ కింద సహకార బ్యాంక్‌కు రావాల్సి ఉందన్నారు. ఈ విషయాన్ని జిల్లా సహకార సంఘం అధ్యక్షులకు, ఉన్నత అధికారులకు వివరించామని త్వరలో వాటిని సైతం బ్యాంక్ ఖాతాలో జమచేస్తామని వారు హామీ ఇచ్చినట్లు వివరించారు. రైతులకు రుణమాఫీ అయిన విషయంపై ఫోన్ మెసేజ్‌లు పంపామని, బ్యాంక్ ఆవరణలో బులిటిన్ బోర్డుపై రుణమాఫీ అయిన రైతుల వివరాల చార్టును పొందుపరచామని తెలిపారు. రుణమాఫీ అయిన రైతులు తిరిగి రైతు రుణం తీసుకుంటామని ఆసక్తి చూపిన వెంటనే ఇవ్వడానికి బాలాపూర్ ఖల్సా సిద్ధంగా ఉందని చెప్పారు. కార్యక్రమంలో డైరెక్టర్ ఎన్ను శ్రీనివాస్‌రెడ్డి, బ్యాంక్ సీఈఓ ఎర్ర జైహింద్‌కుమార్ పాల్గొన్నారు.

సంక్షేమమే బీఆర్ఎస్ లక్ష్యం

మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ కల్వకోలు రవీందర్‌రెడ్డి

మంచాల: అభివృద్ధి, సంక్షేమమే బీఆర్ఎస్ లక్ష్యమని ఇబ్రహీంపట్నం మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ కల్వకోలు రవీందర్‌రెడ్డి పేర్కొన్నారు. గురువారం మంచాల మండల పరిధిలోని తాళ్లపల్లిగూడలో బీఆర్ఎస్ సన్నాహక సమావేశం గ్రామశాఖ అధ్యక్షుడు దండేటికార్ రాజేశ్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా రవీందర్‌రెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు ప్రతీ ఇంటికి చేరేవిధంగా బాధ్యత తీసుకోవాలన్నారు. సంక్షేమ ఫలాలు పొందిన ప్రతి లబ్ధిదారుడు పార్టీకి అండగా నిలవాలని కోరారు. మంచాల మండలంలో బీఆర్ఎస్‌ని మరింత బలోపేతం చేయాలన్నారు. ఈ విషయంలో కార్యకర్తలు సైనికుల్లా పని చేయాలని సూచించారు. రాబోయే రోజుల్లో దళిత బంధు, గృహలక్ష్మి పథకంతో లబ్ధిదారులకు మరింత మేలు చేకూరనుందన్నారు. ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి సహకారంతో గ్రామాల రూపురేఖలు మారాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో కుకుడాల అంజిరెడ్డి, సర్పంచ్ శ్రీనివాస్‌రెడ్డి, ఎంపీటీసీ సుఖన్య శేఖర్‌రెడ్డి, గణేష్, మాజీ సర్పంచ్ యాదయ్య, సాతిరి కృష్ణ, వెంకటేష్, హరికృష్ణ, పంది మల్లేష్, తదితరులు పాల్గొన్నారు.

మరోసారి మోసం చేసే కుట్ర: బీజేపీ




తహసీల్దార్ కార్యాలయం వద్ద బైఠాయించిన బీజేపీ నాయకులు, , బాధితులు



కార్యక్రమంలో మాట్లాడుతున్న సామ రంగారెడ్డి

హయత్‌నగర్: సంక్షేమ పథకాలను ఆశ చూపించి మరోసారి పేదలను మోసం చేయాలని అధికార బీఆర్ఎస్ పార్టీ కుట్ర చేస్తోందని, ఎన్నికలు సమీపిస్తుండటంతో కొత్త పథకాలతో మభ్య పెట్టేందుకు ప్రయత్నిస్తోందని బీజేపీ నాయకులు మండిపడ్డారు. ప్రభుత్వ పథకాలను అర్హులైన వారికి ఇవ్వకుండా పార్టీ కార్యకర్తలకు, నాయకుల అనుచరులకు కట్టబెడుతున్నారని ఆరోపించారు. ఈ మేరకు బీజేపీ రంగారెడ్డి అర్బన్ జిల్లా అధ్యక్షుడు సామ రంగారెడ్డి ఆధ్వర్యంలో సంక్షేమ పథకాలు అందని బాధితులతోకలిసి గురువారం బీజేపీ నాయకులు హయత్‌నగర్ తహసీల్దార్ కార్యాలయం వద్ద ఆందోళన నిర్వహించారు. తాను బతికి ఉన్నా చనిపోయినట్లు చూపించి తన పింఛన్‌ను రద్దు చేశారని ఓ వృద్ధురాలు ఆవేదన వ్యక్తం చేసింది. ఏళ్ల తరబడి ఇళ్లు లేక రోడ్లపై బతుకుతున్నామని, డబుల్ బెడ్ రూమ్‌ల కోసం దరఖాస్తు చేసుకుని ఏళ్లు గడుస్తున్నా తమ పేరు లబ్ధిదారుల జాబితాలో లేదని పలువురు మహిళలు వాపోయారు. గృహలక్ష్మి పథకానికి దరఖాస్తు చేసుకుందామంటే దరఖాస్తు తీసుకొనే అధికారే లేని వారు ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ కార్యాలయం ముందు బైఠాయించారు. తహసీల్దార్ అందుబాటులో లేకపోవడం కార్యాలయంలోకి దూసుకెళ్లి ఆయన ఆయన చాంబర్ వద్ద బైఠాయించారు. దీంతో స్వల్ప ఉద్రిక్తత చోటు చేసుకుంది. పోలీసుల జోక్యంతో తహసీల్దార్ కార్యాలయం నుంచి ఆందోళనకారులు బయటకు వచ్చారు.కార్యక్రమంలో కౌన్సిలర్లు కళ్లెం నవజీవన్‌రెడ్డి, కొప్పుల నర్సింహారెడ్డి, వగా మధుసూదన్‌రెడ్డి, వెంకటేశ్వర్‌రెడ్డి, నాయకులు ప్రేమ్ మహేశ్వర్‌రెడ్డి, కొత్త రవీందర్‌గౌడ్, ఎల్లప్ప, కృష్ణవేణి తదితరులు పాల్గొన్నారు.

ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకోవాలి



కార్యక్రమంలో పాల్గొన్న విద్యార్థులు

దిల్‌సుఖ్‌నగర్: విద్యార్థులు విద్యతో పాటు తమ బాధ్యతలు తెలుసుకొని మంచి ప్రవర్తనతో నడుచుకుంటే ఉన్నత శిఖరాలు అధిరోహించవచ్చని నారాయణ పాఠశాల డీన్, జోన్ ఏజీఎం హేమాంబర్ అన్నారు. గురువారం ఆర్‌కేపురం నారాయణ పాఠశాలలో కేబినెట్ ఇన్‌స్టలేషన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, విద్యార్థి దశలోనే ఉన్నత లక్ష్యాలు పెట్టుకొని వాటిని చేరుకునేంత వరకు కృషి, పట్టుదలతో ముందుకు సాగాలన్నారు. కార్యక్రమంలో ఆర్ఐ రవిప్రసాద్, పాఠశాల ప్రిన్సిపాల్ నీరజ, ఏఓ రమేష్, అకడమిక్ డీన్ మహేష్, వైస్ ప్రిన్సిపాల్స్ స్వర్ణ, శ్రావణి పాల్గొన్నారు.

మండలం సాధించే వరకూ పోరాటం

కాంగ్రెస్ నేత డేవిడ్



రిలే నిరాహార దీక్షలో జేఏసీ నాయకులు, డేవిడ్

తలకొండపల్లి: గట్టుఇప్పలపల్లిని మండలముగా సాధించే వరకు పోరాటం చేస్తామని కాంగ్రెస్ సీనియర్ నేత డేవిడ్ అన్నారు. జేఏసీ ఆధ్వర్యంలో చేపట్టిన రిలే నిరాహార దీక్షలు గురువారం కూడా కొనసాగించారు. ఈ సందర్భంగా ఆయన దీక్షాశిబిరంలో మాట్లాడుతూ గట్టుఇప్పలపల్లి గ్రామానికి మండల ఏర్పాటునకు కావాల్సిన మౌలిక సదుపాయాలు, వనరులు అన్నీ ఉన్నాయని గుర్తు చేశారు. అభివృద్ధి పరంగా గట్టుఇప్పలపల్లి అన్ని రంగాల్లో ముందంజలో ఉందన్నారు. గతంలో 41 రోజులు దీక్షలు చేశామని, ప్రస్తుతం 46 రోజులుగా నిరసనలు చేస్తున్నప్పటికీ ప్రభుత్వం స్పందించకపోవడం బాధాకరమన్నారు. ఈ కార్యక్రమంలో చెన్నయ్య, నాగయ్య, అంజయ్య, శివయ్య, జంగయ్య, దామోదర్, జంగోజి, శ్రీధర్, రాజు, పవన్ వాల్మీకి, జంగయ్య, అశోక్, మాజీ సర్పంచ్ జంగమ్మ, తదితరులు పాల్గొన్నారు.

దైవత్వంతో సమాజంలో శాంతిసౌభాగ్యం



పడకల్‌లో స్లాబ్ వేయిస్తున్న ప్రభాకర్‌రెడ్డి

తలకొండపల్లి: సమాజంలో దైవత్వంతో శాంతి సౌభాగ్యం కలుగుతుందని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు డోకూరి ప్రభాకర్‌రెడ్డి అన్నారు. పడకల్‌లోని పోచమ్మ ఆలయఅభివృద్ధికి కృషి చేస్తానని, శిథిలమైన దేవాలయాలను మరమ్మతులు చేయిస్తానని తెలిపారు. పోచమ్మ ఆలయ కమిటీ సభ్యులు ప్రభాకర్‌రెడ్డిని కలుసుకొని ఆలయ నిర్మాణానికి సంబంధించిన వివరాలు చెప్పారు. దీనికి స్పందించిన ఆయన గురువారం ఆలయ నిర్మాణానికి స్టీల్, ఇతర మెటీరియల్‌ను అందజేశారు. అనంతరం ఆలయ నిర్వాహకులు ప్రభాకర్‌రెడ్డిని సన్మానించారు. కార్యక్రమంలో శ్రీనివాసురెడ్డి, తిరుపతి, రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

మోసపూరిత ప్రకటనలపై ధర్నా రేపు

- ఎన్నికల కోసం పూటకోక పథకం
- బీజేపీ కిసాన్ మోర్చా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మర్పల్లి అంజయ్య యాదవ్



సమావేశంలో మాట్లాడుతున్న అంజయ్య యాదవ్

యాచారం: కేసీఆర్ ఎన్నికల కోసం పూటకోక మోసపూరిత ప్రకటనలు చేస్తూ, ప్రజలను మోసం చేస్తున్నారని ఆరోపిస్తూ 19న యాచారం మండల కేంద్రంలో ధర్నా నిర్వహించనున్నట్లు బీజేపీ కిసాన్ మోర్చా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మర్పల్లి అంజయ్య యాదవ్ పేర్కొన్నారు. గురువారం బీజేపీ మండల అధ్యక్షుడు తాండ్ర రవీందర్ ఆధ్వర్యంలో పార్టీ ముఖ్యులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీజేపీ మహాధర్నాకు యాచారం మండలంలోని 24 గ్రామాల నుంచి కార్యకర్తలు, అభిమానులను తరలించేవిధంగా పార్టీ శ్రేణులు కృషి చేయాలని పేర్కొన్నారు. సీఎం కేసీఆర్ మూడోసారి అధికారంలోకి రావడం కోసం దళితబంధు, గృహలక్ష్మి, బీసీబంధు పథకాలను ప్రవేశపెట్టి ప్రజలను తన వైపు తిప్పుకునే కుట్ర చేస్తున్నాడని వారు ఆరోపించారు. ప్రజలు ఈ విషయాన్ని గమనించాలని కోరారు. వీఆర్ఏ, వీఆర్ఓల ఉద్యోగులను తొలగించి గ్రామాల్లో భూ ఆక్రమణలకు పాల్పడుతున్నారని ఎద్దేవా చేశారు. సమావేశంలో నాగని యాదయ్య, గోగికార్ రమేష్, గొల్లపల్లి జంగయ్యగౌడ్, బూర యాదయ్య, గొల్లపల్లి శ్రీధర్, పుప్పాల శాంతికుమార్, నక్క శ్రీనువాస్ యాదవ్, పల్లపు నరేష్, నడుకుడి కృష్ణ, పత్తి రాజు, సంగెం శ్రీనాథ్ తదితరులు పాల్గొన్నారు.